ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

శనివారం 31 ఆగస్టు 2024 | 5

సంజయ్ కలాసీపై ఫిర్యాదు

అదుపులోకి తీసుకుని తమ సొమ్ములు ఇప్పించాలంటూ పోలీసులకు చేపల చెరువుల రైతుల వినతి

వార్త..7లో

ద్రాక్షారామంలో పూజల్లో పాల్గొన్న మహిళలు



8లో వార్తలు

శుభ శుక్రవారం పూజలు

శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో వ్రతాల్లో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ దంపతులు పూజలు నిర్వహించారు.



ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో పసుపు కొమ్మలతో లక్ష్మీదేవికి అలంకరణ



14 రోజుల డెడ్‌లైన్

రహదారుల వెంబడి చెత్త తొలగించి

ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రహదారుల వెంబడి ఉన్న చెత్త కుప్పలను తక్షణమే తొలగించి ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రం)లకు తరలించాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. జిల్లాలో పారిశుధ్య నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా ప్రధాన రహదారులు, డ్రైనేజీలు, కాల్వలు, ఏటిగట్లు వెంబడి ఉన్న చెత్తకుప్పలను తక్షణమే తొలగించి సమీపంలోని సాలిడ్‌వేస్ట్ ప్రోసెసింగ్ సెంటర్లకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలు 14 రోజుల్లో తమ పరిధిలో ఎక్కడా చెత్త కుప్పలు లేవని రాత పూర్వకంగా నివేదించాలన్నారు. జిల్లాలోని 385 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకు 270 ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల నిర్మాణం పూర్తి అయిందన్నారు. వీటిలో 193 పూర్తి స్థాయిలో పనిచేస్తున్నాయన్నారు. వివిధ కారణాలతో 77 షెడ్లు పనిచేయడం లేదన్నారు. మరో మూడు నెలల్లో 77 షెడ్లను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు అదనంగా మరో 50 షెడ్లు నూతనంగా నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. పంచాయతీ ఆదాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీల ఆదాయం, ఖర్చులను వివరిస్తూ ఒక ఆన్‌లైన్ పోర్టల్‌ను అభివృద్ధి చేయాలన్నారు. ఆర్థిక అంశాలపై అవగాహన కలిగిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు, ఇద్దరు ఈవోపీఆర్డీలను ఒక బృందంగా నియమించి సాంకేతిక నిపుణుల సహాయంతో సంబంధిత పోర్టల్‌ను అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీల అనుమతి లేకుండా జిల్లాలో ఎక్కడా ఫెర్రీలు నిర్వహించరాదన్నారు. మండలాల పరిధిలో ఉన్న ఫెర్రీలు, భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అన్న అంశంపై ఆరా తీశారు. అనుమతులు లేకుండా నిర్వహించే ఫెర్రీలను గుర్తించి నివేదిక అందించాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు, ఈవోపీఆర్డీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గోల్డెన్ అవర్ వైద్య సేవలపై చర్చ

అమలాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలు సంక్షేమ వసతిగృహాల్లోని విద్యార్థులకు ప్రమాద, అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు గోల్డెన్ అవర్‌లో వైద్య సేవలు అందించే విధంగా గోల్డెన్ అవర్ బీమా సౌకర్యాన్ని కల్పించడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అతి తక్కువ ప్రీమియంతో బీమా సౌకర్యం కల్పించేందుకు బ్యాంకర్లతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశమై చర్చించారు. జిల్లాలో 7752 మంది విద్యార్థులు గురుకుల, సంక్షేమ వసతి గృహాల్లో ఉండి చదువుకుంటున్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఎన్జీవోలు నిర్వహిస్తున్న అనాథాశ్రమాల్లో 712 మంది పిల్లలు ఉన్నారని వీరందరికీ రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వైద్య సేవలు అందించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా చేపడతామన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ వర్మ, బ్యాంకర్లు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో హరితాంధ్రప్రదేశ్

మొక్క నాటుతున్న కలెక్టర్



విద్యార్థినికి మొక్క అందిస్తున్న కలెక్టర్,ఎంపీ



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, ఆగస్టు 30: ప్రతిఒక్కరు తమ వంతు బాధ్యతగా ఓ మొక్కను నాటి హరితాంధ్రప్రదేశ్ సాధన కోసం కృషి చేయాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, గిడ్డి సత్యనారాయణ, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పిలుపునిచ్చారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఉన్నత పాఠశాల ప్రాంగణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మొక్కలు నాటారు. విద్యార్థులు సైతం వన మహోత్సవంలో భాగస్వాములై మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతను తీసుకోవాలని నేతలు పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో టాయిలెట్ల నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వం వన మహోత్సవం నిర్వహిస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో వంద మొక్కలు నాటామని, విద్యార్థులు వారి ఇళ్ల వద్ద నాటుకునేందుకు వీలుగా 260 మొక్కలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, జిల్లా అటవీశాఖ అధికారి ఎంవీవీ ప్రసాదరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి, డీవైఈవో జి.సూర్యప్రకాశం పాల్గొన్నారు.



జిల్లా ప్రత్యేకాధికారిగా బాలాజీరావు

అమలాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మోనటరింగ్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు ప్రత్యేక అధికారిని నియమించింది. 2011 ఐఏఎస్ కేడర్‌కు చెందిన సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ సర్వే డైరెక్టర్ లత్కర్ శ్రీకేష్ బాలాజీరావును ప్రత్యేకాధికారిగా నియమించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసే పథకాలను మోనటరింగ్ చేయడంతో పాటు ప్రత్యేక సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు. త్వరలోనే బాలాజీరావు జిల్లాలో పర్యటించే అవకాశం ఉంది.


ఇసుక దొంగలపై కేసు

రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్

అమలాపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ హౌసింగ్ కాలనీ లేఅవుట్-4లో గృహనిర్మాణ లబ్ధిదారులకు అందించాల్సిన ఇసుక దొంగతనానికి సంబంధించి రామచంద్రపురం ఆర్డీవో సుధాసాగర్ వివరణ ఇచ్చారు. గృహనిర్మాణ ఏజెన్సీలకు, లబ్ధిదారులకు అందించే నిమిత్తం 6,245 మెట్రిక్ టన్నుల ఇసుకను స్టాక్ పాయింట్‌లో ఉంచారన్నారు. అక్కడి నుంచి 3200 మెట్రిక్ టన్నుల ఇసుకను గృహనిర్మాణ శాఖ అధికారులు లబ్ధిదారులకు అందజేశారు. 3045 మెట్రిక్ టన్నుల ఇసుక స్టాకు పాయింట్‌లో ఉండాల్సి ఉందని, అయితే సంబంధిత శాఖాధికారుల రోజువారీ తనిఖీలో భాగంగా ఈ నెల 27న నిర్వహించిన తనిఖీలో 2వేల మెట్రిక్ టన్నులు దొంగిలించినట్టు గుర్తించారన్నారు. దీనిపై పరిశీలన చేయగా తాళ్లపాలెం రైల్వేట్రాక్ సమీపంలో జేసీబీతో సహా సదరు ఇసుకను డంప్ చేసినట్టు ఉందన్నారు. జేసీబీ యజమాని కట్టా అశోక్ అలియాస్ పాండును గృహనిర్మాణశాఖ అధికారులు విచారణ చేయగా తనతో పాటు వాసంశెట్టి చంద్రశేఖర్ అలియాస్ బాల, ఆదిమూలం సాయిమణికంఠ, కాండ్రేగుల సాయిరామ్, దొంగ శ్రీధర్ ఇసుకను లేఅవుట్ నుంచి ఈ నెల 26న అధిక ధరకు విక్రయించే లక్ష్యంతో దొంగిలించామని తెలిపారు. దీంతో గృహనిర్మాణశాఖ అధికారులు ద్రాక్షారామ పోలీసుస్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఆర్డీవో తెలిపారు.

ఆటో తిరగబడి ఐదుగురు విద్యార్థినులకు స్వల్పగాయాలు

అమలాపురంరూరల్, ఆగస్టు 30: ఆటో తిరగబడి ఐదుగురు విద్యార్థినులకు గాయాలయ్యాయి. సమనస శ్రీరామ పబ్లిక్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులు అదనపు తరగతులు ముగించుకుని శుక్రవారం సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్తుండగా పోలేరమ్మ ఆలయం వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. వారిని అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం ఇంటికి తరలించారు.



వరి రైతులకు శాపంగా మారుతున్న భారీ వర్షాలు

ముంపులోనే వరిచేలు

ఖరీఫ్ సేద్యం కష్టమంటున్న రైతులు

అమలాపురం కుమ్మరికాలువ మేజర్ డ్రైన్ ఆనుకుని వర్షానికి ముంపు బారిన పడ్డ పొలం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. వీటి కారణంగా వరిచేలకు నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే వరద ముంపు వల్ల పంట నష్టపోయిన రైతులు మళ్లీ కొన్నిచోట్ల నాట్లు వేసి సాగుకు సమాయత్తమవుతున్న తరుణంలో వర్షాలు వారికి ఇబ్బందికరంగా మారాయి.

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు అన్నదాతల పాలిట శాపంగా మారాయి. గతంలో గోదావరి వరదల కారణంగా ప్రధానమైన డ్రెయిన్లు పొంగి ప్రవహించడం వల్ల వాటిని ఆనుకుని ఉన్న వేల ఎకరాల వరిచేలు జలదిగ్బంధానికి గురయ్యాయి. అయితే వాటి నుంచి ఎలాగోలా తేరుకున్నప్పటికీ అల్పపీడనం ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మళ్లీ చేలల్లో వర్షపునీరు నిలిచిపోవడం వల్ల వరి పంటకు తీవ్ర నష్టం కలిగిస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముంపు బారిన..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

ఈ వర్షాల వల్ల వరి పంటపై తెగుళ్లు సోకే ప్రమాదం ఉందని అన్నదాతల ఆందోళన. ఎక్కువ రోజులు వరిచేలన్నీ నీళ్లల్లో నానితే వరిమూనలు కుళ్లిపోయి పంట నష్టపోయే ప్రమాదం ఉందనేది వారి ఆవేదన. గతం కంటే భిన్నంగా సాగు సమయంలో వరదలు, వర్షాలు తమను వెంటాడుతున్నాయని పేర్కొంటున్నారు. గత మూడు నెలల నుంచి ప్రకృతి వైపరీత్యాల వల్ల ఖరీఫ్ సాగు ముందుకు సాగడం లేదని ఇదే పరిస్థితి కొనసాగితే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా డ్రెయిన్లలో ముంపునీరు ఇంకా దిగే మార్గం లేకపోవడంతో చేలల్లో నీరు క్రమంగా పెరుగుతుందని, ఈ పరిస్థితుల వల్ల వరిసాగుచేయడం కష్టమని రైతులు చెబుతున్నారు. అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం, కాట్రేనికోన తదితర మండలాల్లో ముంపునీటి సమస్య వల్ల ఖరీఫ్ సేద్యంలో అవాంతరాలు ఏర్పడుతున్నాయని రైతులు చెబుతున్నారు. కొన్నిచోట్ల చేలు ఏపుగా పెరిగినప్పటికీ గత నెల రోజుల నుంచి చేలల్లో నీరు నిలిచిపోవడం వల్ల ఎదుగుదలలో మందగమనం చోటు చేసుకుని ఈనిక దశ వచ్చే సమయానికి నష్టం పెరిగే ప్రమాదం ఉందనేది రైతుల ఆవేదన. కొన్ని రోజుల పాటు వర్షాలు ఇదే తరహాలో కురిస్తే తీర ప్రాంత మండలాల్లో వరిసాగుకు తిలోదకాలు పలికే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కురుస్తూనే ఉంది..

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి వర్షం పడుతూనే ఉంది.. జనజీవనం స్తంభించింది. రోడ్లపై నీరు చేరింది. చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు..విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం..అమలాపురంలో పలు రోడ్లు ముంపునకు గురయ్యాయి.



అమలాపురంలో జలమయమైన రోడ్డు

తూడుతో మూసుకున్న డ్రెయిన్లు



తూర్పులంక వద్ద గుర్రపుడెక్కతో మూసుకుపోయిన కౌశిక డ్రెయిన్

అల్లవరం, ఆగస్టు 30: ప్రతి ఏటా లక్షలాది రూపాయలు వెచ్చించి రామేశ్వరం మొగలో మేటలు తొలగించినా అల్లవరం మండలంలోని వాసాలతిప్ప, దేశికోడు, కుమ్మరికాలువ లోయర్ కౌశిక డ్రెయిన్లు, మైనర్ డ్రెయిన్లు, రెవెన్యూ డ్రెయిన్లు తూడు, గుర్రపుడెక్క పెరిగిపోయి ముంపు దిగడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. డ్రెయిన్లలో అడ్డంకులను తొలగించాలని, ఆక్వా చెరువుల నుంచి వ్యర్థాల సొజ్జు తోడకుండా చూడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముంపు వల్ల సుమారు 1500 ఎకరాలలో వరినాట్లు వేయలేదు. రామేశ్వరం మొగ ఆధునికీకరించిన డ్రెయిన్లలో పేరుకుపోయిన అడ్డంకులను యుద్ధప్రాతిపదికన తొలగించాలని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే ఆనందరావు, డ్రైనేజీ అధికారులకు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా అధికారుల, ఎమ్మెల్యే ఆదేశాలతో డ్రెయిన్లలో అడ్డంకులు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు రైతులకు భరోసా ఇచ్చారు. రామేశ్వరం మొగ వద్ద ఇంకా డ్రెజ్జింగ్ చేయాల్సి ఉందని కుమ్మరికాలువ డ్రెయిన్‌లో తూడు తొలగిస్తున్నారని డ్రెయిన్స్ ఏఈ కె.సునీత తెలిపారు.

రొయ్యల అక్రమ సాగు జరగనివ్వం

తాగు, సాగునీటిని పరిరక్షిస్తాం

కొత్తకోట గ్రామస్థులకు అండగా ఉంటాం

చెరువులను పరిశీలించిన మంత్రి వాసంశెట్టి సుభాష్



విలేకర్లతో మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

కె.గంగవరం, ఆగస్టు 30: కొత్తకోటలో ఎట్టి పరిస్థితుల్లోను రొయ్యల అక్రమ సాగు కొనసాగనియ్యమని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చెప్పారు. గత రెండు రోజులుగా గ్రామంలో రొయ్యల సాగుకు వ్యతిరేకంగా కొత్తకోటల గ్రామస్థులు నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న మంత్రి సుభాష్ కొత్తకోటలో వివాదానికి కారణమైన చెరువులను శుక్రవారం పరిశీలించారు. రొయ్యల సాగుకు వ్యతిరేకంగా ఆందోళన చేసిన వారితో ఆయన మాట్లాడారు. మహిళలు రొయ్యల సాగు వల్ల పడుతున్న ఇబ్బందులు వివరించారు. చుట్టుపక్కల పొలాలు పంటలకు ఇబ్బందులు వస్తున్నాయని, చెరువులు, బావులు కలుషితమవుతున్నాయని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. తాగునీరు కూడా కలుషితం కావడంతో అస్వస్థతకు గురవుతున్నామని చెప్పారు. అనంతరం మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజలకు అండగా ఉంటామని చెప్పారు. గత ఐదు సంవత్సరాల క్రితం ఇక్కడ చెరువుల తవ్వకోవడానికి అనుమతులు తీసుకున్నారని చెప్పారు. ప్రస్తుతం చట్ట వ్యతిరేకంగా పనులు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఈ పనుల వల్ల తాగునీరుకు, సాగునీరుకు ఇబ్బందులు వస్తున్నట్టు గుర్తించామన్నారు. ఇప్పటికే అధికారులు అన్ని పరిశీలించి నివేదిక రూపొందిస్తున్నారని, చట్ట వ్యతిరేకంగా చేపట్టిన పనులు సరిచేసుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇక్కడ గ్రామస్థులకు త్వరలోనే తాగునీరు అందిస్తామని చెప్పారు.



సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



శ్రావణలక్ష్మీ రావమ్మా... వరాలివ్వమ్మా

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు... భక్తజనసంద్రమైన పిఠాపురం పాదగయ క్షేత్రం

పిఠాపురం, ఆగస్టు 30: దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన పాదగయ క్షేత్రం శ్రావణ శోభతో విరాజిల్లింది. మహిళా భక్తులతో కిటకిటలాడింది. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొనేందుకు వర్షంలోనూ మహిళలు భారీగా తరలివచ్చారు. పూజల్లో పాల్గొన్న వారికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన చీరలు, పసుపు, కుంకుమ అందజేశారు.

కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠానికి అధిష్టాన దేవత అయిన పురుహూతికా అమ్మవారు, ఆదిశంకరాచారులు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి, స్వయంభూ కుక్కుటేశ్వర స్వామి సన్నిధిలో వ్రతాలు ఆచరించేందుకు మహిళలు భారీగా తరలివచ్చారు. తొలుత మూడు బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహించాలని భావించినా మహిళలు అధికంగా తరలిరావడంతో ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నాలుగు విడతలుగా వ్రతాలు జరిపించారు. ఆలయ ప్రాంగణం, దత్తాత్రేయ మండపం, చండీ హోమ ప్రదేశం, సరస్వతీదేవి మందిరం సహా ఆలయమంతా మహిళలు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు సతీమణి పద్మజతో పాటు ఆరు వేల మందికి పైగా మహిళలు వరలక్ష్మీ వ్రతం ఆచరించారు.

వేదమంత్రోచ్ఛారణలతో శ్రావణ లక్ష్మికి శాస్త్రోక్తంగా పూజలు జరిగాయి. వ్రతంలో పాల్గొన్న భక్తులకు కొబ్బరికాయ, గాజులు, పసుపు, కుంకుమ, అరటి పళ్లు, పువ్వులు తదితర పూజా సామగ్రి, చీర, జాకెట్టు, వరలక్ష్మి రూపు అందజేశారు. అనంతరం పులిహోర, చక్రపొంగలి ప్రసాదం ప్యాకెట్లు పంపిణీ చేశారు. పాదగయ క్షేత్రంలో వస్తున్న సంప్రదాయం, ఆనవాయితీకి అనుగుణంగా చీరలు, పసుపు, కుంకుమ, గాజులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ సమకూర్చారు. వీటిని భక్తులకు జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు సతీమణి పద్మజ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అందజేశారు.

శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తున్నా భక్తులు భారీగా తరలివచ్చారు. తొలి బ్యాచ్ ఉదయం 5 గంటలకు ప్రారంభిస్తామని ప్రకటించడంతో అప్పటికే క్యూలైన్లలోకి చేరారు. క్యూలైన్ నుంచి ఆలయంలోకి వెళ్లే చోటే చీరలు, సామగ్రి అందజేశారు. వర్షం తగ్గకపోవడంతో టెంట్ల నుంచి నీరు కారడంతో కొంత ఇబ్బంది కలిగింది.

పిఠాపురం నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండానే భావనతో సంప్రదాయాన్ని గౌరవిస్తూ వ్రతంలో పాల్గొన్న ప్రతి ఆడపడుచుకు పవన్ కల్యాణ్ చీర, గాజులు, పసుపు, కుంకుమ పంపించారని ఎమ్మెల్సీ హరిప్రసాద్ తెలిపారు. వరలక్ష్మీ వ్రతాల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులు, ఆలయ ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవాని, పిఠాపురం సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



వ్రతమాచరిస్తున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు సతీమణి పద్మజ





వ్రతమాచరిస్తున్న ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవాని

రత్నగిరిపై ఘనంగా ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 30: శ్రావణ మాసం చివరి శుక్రవారం అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు కాకినాడ జిల్లా నలుమూలల నుంచి అశేష సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ఉదయం 8 గంటలకు నిత్య కల్యాణ మండపంలోని ప్రత్యేక వేదికపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారిని, మరో వేదికపై సిరులిచ్చే వరలక్ష్మీ దేవిని ఆశీనులు గావించారు. దేవస్థానం పీఆర్వో కృష్ణారావు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం జ్యోతిప్రజ్వలనతో వ్రతాలను ప్రారంభించారు. వ్రత పురోహిత ముఖ్యుడు చామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో మహిళలతో గణపతి పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి అష్టోత్తర, శతనామ పూజ చేయించారు. చతుర్వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. 6,200 మంది మహిళలు వ్రతాల్లో పాల్గొన్నారని ఆలయ అధికారులు వెల్లడించారు. వారందరికీ జాకెట్టు ముక్క, అమ్మవారి గాజులు, ప్రసాదంతో పాటు ఉచిత దర్శనం కల్పించి అన్న ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏపీఆర్వో ఎం.గణపతి, సూపరింటెండెంట్ స్వామీజీ ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక వేదికపై ఆశీనులైన సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారు, వరలక్ష్మీ దేవి (పైన), వ్రతమాచరిస్తున్న మహిళలు



ఎమ్మెల్సీ పదవికి, వైసీపీకి పద్మశ్రీ రాజీనామా

ఆమె బాటలోనే మరికొంతమంది మాజీ కార్పొరేటర్లు!



కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 30: ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తన పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ఆమె శాసనమండలి చైర్మన్‌కు శుక్రవారం అందజేశారు. పద్మశ్రీ మత్స్యకార మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా, మత్స్యకార సంక్షేమ సమితి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసి వైసీపీలో చేరారు. 2023 మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆమెను గవర్నర్ కోటా నుంచి వైసీపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆగస్టు 9న ఎమ్మెల్సీగా నియమిస్తూ అప్పటి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా పద్మశ్రీ బాటలోనే మరికొంతమంది వైసీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వైసీపీ నేతలు ఎవరూ బయటకు కనిపించకపోవడంతో ఈ అనుమానాలు మరింత ఎక్కువవుతున్నాయి.



పోస్టర్ విడుదల చేస్తున్న ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి

13, 14 తేదీల్లో 'ఆదిత్య వేద-2కే24' టెక్ ఫెస్ట్

గండేపల్లి, ఆగస్టు 30: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆదిత్య వేద-2కే24 పేరిట జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్‌ను సెప్టెంబరు 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్టు ప్రో చాన్సలర్ డాక్టర్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పోస్టర్‌ను విడుదల చేశారు. వివిధ విభాగాల్లో పేపర్, పోస్టర్, ప్రాజెక్టు ప్రజెంటేషన్, క్విజ్ పోటీలు జరుగుతాయని, విజేతలకు నగదు, జ్ఞాపిక ప్రశంసాపత్రం అందజేస్తామని చెప్పారు. రాష్ట్రంలో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులకు పోటీల్లో పాల్గొనాలని ఆహ్వానం పంపామని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ డోలా సంజయ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రేప్ కేసులో ముద్దాయికి

పదేళ్ల జైలు

ఉప్పలగుప్తం, ఆగస్టు 30: రేప్ కేసులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి పంచాయతీ పెదరాఘవులపేటకు చెందిన కొప్పాడి నాగరాజు(31)కు కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... 2012లో పెదరాఘవులపేట ఎంపీపీ పాఠశాలలో విద్యా వలంటీరుగా పని చేసిన నాగరాజు సహచర వలంటీరు అయిన అదే గ్రామానికి చెందిన ఓలేటి కుమారి (31)ని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించాడు. అనంతరం పెళ్లికి ససేమిరా అనడంతో మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు 2019లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఉప్పలగుప్తం ఎస్ఐ ఎన్.సన్యాసినాయుడు కేసు నమోదు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం నిర్ధారణ కావడంతో సెషన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

13 మంది బాలికలు డిశ్చార్జి

ఏలేశ్వరం, ఆగస్టు 30: కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన 24 మందిలో 13 మందిని శుక్రవారం డిశ్చార్జి చేశామని ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శైలజ తెలిపారు. మిగిలిన 11 మందికీ మెరుగైన వైద్యం అందిస్తున్నమని, త్వరలోనే కోలుకుంటారని ఆమె చెప్పారు.

నమ్మించి మోసం చేశాడు

ఒడిసా చేపల వ్యాపారి కిడ్నాప్‌తో రూ.4.50 కోట్లు నష్టపోయాం

అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బాధిత రైతులు

అమలాపురం టౌన్, ఆగస్టు 30: రైతుల చెరువుల వద్ద నుంచి చేపలను పెద్ద మొత్తంలో దఫదఫాలుగా కొనుగోలు చేసి సొమ్ములు చెల్లిస్తామని మోసగించిన ఒడిసా చేపల వ్యాపారి సంజయ్ కలాసీని పోలీసులు తక్షణం అదుపులోకి తీసుకుని తమను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం రాత్రి ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాలకు చెందిన బాధిత రైతులు పలువురు అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. రైతులకు సొమ్ములు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒడిసాకు చెందిన సంజయ్ కలాసీని గురువారం కొందరు కిడ్నాప్ చేశారన్న సమాచారంతో రైతులు మరోసారి రోడ్డెక్కారు. చేపల వ్యాపారి కిడ్నాప్‌కు, తమకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఎస్.యానంకు చెందిన స్వామినాయుడు సహకారంతోనే మూడేళ్ల క్రితం సంజయ్ కలాసీకి సరుకు ఇచ్చామన్నారు. సొమ్ములు అప్పుడు చెల్లిస్తా, ఇప్పుడు చెల్లిస్తా అంటూ మోసం చేస్తు న్న తీరుపై సంజయ్ కలాసీపై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ వ్యవహారం మరుగున పడిందన్నారు. ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాలకు చెందిన తామంతా రూ.4.50 కోట్ల మేర నష్టపోయామని విలేకరులకు వివరించారు. సంజయ్ కలాసీని పోలీసులు అదుపులోకి తీసుకుని తమ సొమ్ములు తమకు ఇప్పించి ఆదుకోవాలని రైతులు దంగేటి నరసింహారావు, ఆకుల జోగయ్యనాయుడు, ఎన్.శ్రీనివాసరావు, వైదాడి నాగేశ్వరరావు, కొప్పాడి దుర్గారావు తదితరులు కోరుతున్నారు.



కలాసీని అరెస్టు చేసి ఆదుకోవాలని కోరుతున్న ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల రైతులు

హరికథా కళాకారుడు మృతి

ఉప్పలగుప్తం, ఆగస్టు 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన ప్రముఖ హరికథ కళాకారుడు చిక్కం కృష్ణమూర్తి భాగవతార్ (71) శుక్రవారం మృతి చెందారు. టీటీడీ ఆధ్వర్యంలో ఆయన పలు రాష్ట్రాల్లో హరికథా గానం చేశారు. దూరదర్శన్, ఆకాశవాణి కళాకారుడిగా ప్రఖ్యాతిగాంచారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు నాగబాబు కూడా హరికథా కళాకారుడే. కృష్ణమూర్తి భాగవతార్ మృతికి గ్రామస్తులతో పాటు ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, ఉప సర్పంచ్ మోకా శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు.



చిక్కం కృష్ణమూర్తి భాగవతార్ (పాత చిత్రం)

పెన్షన్ల పంపిణీలో

గ్రామ వలంటీర్ల చేతివాటం

రూ.14లక్షలు రికవరీకి ఆదేశాలు

రాజవొమ్మంగి, ఆగస్టు 30: మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో పెన్షన్ల పంపిణీలో వలంటీర్లు చేతివాటం ప్రదర్శించారు. దాదాపు ప్రతి గ్రామంలోనూ చనిపోయిన వ్యక్తులు బతికి ఉన్నట్టు చూపి లక్షల రూపాయలను వారి జేబుల్లో వేసుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన పెన్షన్ సొమ్ములపై ఆడిట్ అధికారులు సామాజిక తనిఖీ చేపట్టారు. మండలంలో చనిపోయిన వారి పేరిట వలంటీర్లు తీసుకున్న సొమ్ము, నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అయినవి... మొత్తం రూ.14,17,500 రికవరీ చేయాల్సి ఉందని నివేదిక ఇచ్చారు. దీనిపై రాజవొమ్మంగి ఎంపీడీవో యాదగిరేశ్వరావు మాట్లాడుతూ.... ఆడిట్ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం చాలా గ్రామాల్లో చనిపోయిన వారి పేరుతో వలంటీర్లు పెన్షన్ సొమ్ము తీసుకున్నట్టు గుర్తించామన్నారు. అత్యధికంగా చికిలింత పంచాయతీలో రూ.3,08,500, జడ్డంగి పంచాయతీలో రూ.1,07,250 తీసుకున్నట్టు నివేదికలో ఉందని, సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఇండియన్ కోస్ట్‌గార్డ్ అధికారి


బొక్కుసొర చేప పరిరక్షణతో

సముద్ర జలాల శుద్ధి

కాకినాడ సిటీ, ఆగస్టు 30: బొక్కుసొర చేప పరిరక్షణ ద్వారా సముద్ర జలాల శుద్ధి జరుగుతుందని, చేపల వేట సమయంలో అవి వలలకు చిక్కినా సముద్రంలోనే వదిలి వేయాలని అధికారులు సూచించారు. ప్రపంచ బొక్కుసొర చేప దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడలోని కుంభాభిషేకం రేవులో మత్స్యకారులు, బోట్ల యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యక్షత వహించిన వన్యప్రాణి విభాగం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ అంతరించిపోతున్న బొక్కు సొర చేపను వేటాడడం నేరమని, దీని ప్రాముఖ్యతను మత్స్యకారులు గుర్తించాలని వివరించారు. మత్స్య శాఖ ఏడీ ఆర్.నూకరాజు, వి.అనురాధ, ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఎస్ఈ బి.ధనుంజయ, మెరైన్ ఏఎస్ఐ బి.ఏలియా, ఫారెస్ట్ సెక్షన్ ఆధికారి ఎస్.వీరభద్రరావు, బోట్ల యూనియన్ అధ్యక్షుడు సంగాడి నాగేశ్వరరావు, మత్స్యకారులు, బోట్ల యజమానులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళికపై ఆరా

హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అధికారులతో వెబ్-ఎక్స్ మీటింగ్



కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 30: హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.రాజబాబు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల హౌసింగ్ అధికారులతో శుక్రవారం వెబ్ ఎక్స్ మీటింగ్ నిర్వహించారు. హౌసింగ్ శాఖలో వంద రోజుల ప్రణాళిక పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి 4,400 ఇళ్లను పూర్తి చేయడానికి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, నీటి సరఫరా, అప్రోచ్ రోడ్లు, అంతర్గత రోడ్లు, విద్యుదీకరణ మొదలైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఈఈలు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.


వృద్ధురాలిపై అత్యాచారం

కరప మండలం వేళంగిలో ఘటన

కరప, ఆగస్టు 30: ఇంట్లో ఒంటరిగా ఉన్న 85ఏళ్ల వృద్ధురాలిపై ఒక వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి గ్రామంలో జరిగింది. స్థానికులు, కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేళంగా కరణం గారి వీధిలో ఒక వృద్ధురాలు సోదరితో కలిసి నివాసముంటోంది. సోదరి ఊరు వెళ్లడంతో వృద్ధురాలు ఒంటరిగా ఉంది. గురువారం రాత్రి 11 గంటలు దాటిన తర్వాత అదే గ్రామానికి చెందిన నొక్కు వెంకటరమణ ఇంట్లోకి చొరబడి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడినట్టు తెలుస్తోంది. శుక్రవారం ఉదయం శరీరంపై రక్తపు గాయాలతో మూలుగుతున్న బాధితురాలిని గమనించిన స్థానికులు కరప పోలీసులకు సమాచారం అందించారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో పెదపూడి ఎస్ఐ కె.రామారావు నిందితుడు వెంకటరమణను అదుపులోకి తీసుకుని కరప పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. బాధితురాలిపై అత్యాచారం జరగలేదని, తాగిన మైకంలో నిందితుడు ఆమెపై కత్తితో దాడి చేసినట్టుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారని, అతడి భార్య ఉపాధి నిమిత్తం కువైట్‌లో ఉంటోందని స్థానికులు తెలిపారు. గతంలో రాయవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో నిందితుడిపై ఇదే తరహా కేసు నమోదైనట్టుగా తెలుస్తోంద. వెంకటరమణ మందు తాగితే సైకోలా ప్రవర్తిస్తాడని గ్రామస్తులు చెప్తున్నారు. బాధితురాలి వద్ద నుంచి స్టేట్‌మెంట్ తీసుకుంటున్నామని, దాన్ని అనుసరించి నిందితుడిపై కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ ప్రసన్నకుమార్ తెలిపారు. కాగా ముదుసలిపై అఘాయిత్యానికి పాల్పడిన మానవ మృగంపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

చింతూరు మండలంలో

మరో శిశువు మృతి



చింతూరు ఆగస్టు 30: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో శుక్రవారం మరో శిశువు మృతి చెందింది. దీంతో ఒక్క ఆగస్టు నెలలోనే మృతి చెందిన చిన్నారుల సంఖ్య ఏడుకు చేరింది. చింతూరు మండలం బోరింగ్ గుంపు (కలిగొండ)కు చెందిన కుంజా జయమ్మ స్థానిక మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పని చేస్తోంది. ఆమె 8 నెలల గర్భవతి. గురువారం రాత్రి పురిటినొప్పులు రావడంతో జయమ్మను ఆటోలో ఏడుగురాళ్లపల్లి ప్రాథమిక ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. అయితే వర్షం కారణంగా కలిగొండ, పేగ గ్రామాల మధ్య వాగు ఉధృతి పెరిగింది. దీంతో ప్రవాహం తగ్గే వారంతా వేచి చూశారు. శుక్రవారం ఉదయం తగ్గుముఖం పట్టడంతో గర్భిణిని వాగు దాటించారు. సమీపంలోని పేగ గ్రామానికి ఆటోలో చేరుకునే సరికి జయమ్మకు నొప్పులు మరింతగా పెరిగాయి. పేగలో ఒకరి ఇంటి వద్ద ఆమె ప్రసవించింది. అక్కడి నుంచి తిరిగి ఆటోలో ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు తల్లి, బిడ్డలను పరీక్షించి శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. అనంతరం అంబులెన్సులో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శిశువును పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. దాంతో చేసేదేమీ లేక మృత శిశువును తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లి దహన సంస్కారాలు జరిపారు.



నిందితులను చూపిస్తున్న అటవీ శాఖ అధికారులు

గోనెసంచుల్లో గుట్టుగా... వాహనంలో తరలిస్తున్న

278 తాబేళ్ల పట్టివేత

మోతుగూడెం, ఆగస్టు 30: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో భారీ సంఖ్యల్లో తాబేళ్లను పట్టుకున్నారు. లక్కవరం అటవీ క్షేత్ర పరిధిలోని సుకుమామిడి నార్త్ బీట్‌లో ఫారెస్ట్ అధికారులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఏపీ20ఏడీ 3789 మహేంద్ర స్కార్పియో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో 8 గోనె సంచులను గమనించి తెరవగా తాబేళ్లను గుర్తించారు. వాటిని లెక్కించగా మొత్తం 278 తాబేళ్లు వున్నాయి. వాటిలో 33 చనిపోగా 245 బతికి ఉన్నాయని అధికారులు తెలిపారు. అమలాపురం నుంచి ఒడిసా రాష్ట్రంలోని 79 గ్రామానికి తాబేళ్లను తరలిస్తున్నారు. పొల్లూరుకు చెందిన కార్తీక్ మండల్, కోరుకొండ మండలం జగన్నాథపురానికి చెందిన బలిన సాయికృష్ణలను అదుపులోకి తీసుకుని వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. వాహనాన్ని, తాబేళ్లను సీజ్ చేసి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. తాబేళ్లను సీలేరు నదిలో వదిలిపెట్టారు. కేసును చేధించిన వారిలో లక్కవరం రేంజర్ జీవీ నానాజీ, డీఆర్వో కె.సత్యనారాయణ, ఫారెస్ట్ బీట్ అధికారులు కె.రామదాసు వెంకట్, సుకుమామిడి నార్త్ బీట్ ఇన్‌చార్జి, తూలుగొండ బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.



కృష్ణవరం టోల్‌గేట్ వద్ద పట్టుకున్న గంజాయి

రూ.4.23 లక్షలు విలువైన 84 కిలోల

గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లతాకుమారి

కిర్లంపూడి, ఆగస్టు 30: కాకినాడ జిల్లా కిర్లంపూడిలో రూ.4.23లక్షలు విలువైన 84.66 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి తెలిపారు. కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద గురువారం ఎస్ఐ సతీష్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కేఏ01 ఏఎం 3279 ట్యాంకరును ఆపి పరిశీలించారు. క్యాబిన్ అరలో, క్లీనర్ సీటు కింది భాగంలో మొత్తం 43 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయిల్ ట్యాంకరుతో పాటు ఒక సెల్ ఫోన్, రూ.వెయ్యి నగదు సీజ్ చేశారు. డ్రైవర్ అన్సారీ, పాంగీ సన్యాసిరావు అలియాస్ సంతోష్, కైసర్ల దివాకర్‌లను అరెస్టు చేయగా రాజేష్ టీకే, ధనశేఖరన్ బాలచంద్ర పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన ముగ్గురినీ ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ చెప్పారు. గంజాయి విలువ రూ.4,23,300, ఆయిల్ ట్యాంకరు విలువ రూ.7లక్షలు అన్నారు. విలేకరుల సమావేశంలో జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

దేవదాయశాఖ సహాయ కమిషనర్‌కు సత్కారం

ఐ.పోలవరం, ఆగస్టు 30: దేవదాయశాఖ సహాయ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయ ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ దంపతులను శుక్రవారం స్థానిక లలిత భక్త మండలి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గత ఐదేళ్లలో ఆలయ అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. దాట్ల రామకృష్ణంరాజు, కటారి రామవెంకటసుబ్బరాజు, ఆలయ అర్చకులతో పాటు, లలిత భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

● భీమేశ్వరాలయానికి పోటెత్తిన మహిళలు ● వ్రతం ఆచరించిన మంత్రి సుభాష్ దంపతులు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న మంత్రి సుభాష్ దంపతులు

ద్రాక్షారామ,ఆగస్టు 30: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. వేలాది మంది మహిళాభక్తులు సామూహిక వరలక్ష్మి వ్రతాలుఆచరించారు. ఉదయం నుండి భక్తులను ఆలయంలోకి అనుమతించారు. క్యూలైన్లలో సిబ్బంది దాతలు సమకూర్చిన చీర, రవిక, వరలక్ష్మి రూపు, పూజా సామగ్రి భక్తులకు అందజేశారు. ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన వరలక్ష్మి విగ్రహంవద్ద ఆలయఅర్చకులు వ్రతాలు నిర్వహిస్తూ మంత్రోచ్ఛారణలతో భక్తులతో వ్రతాలు చేయించారు. వరలక్ష్మి కథా శ్రవణం జరిపారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుబాష్ దంపతులు, తల్లిదండ్రులు సత్యం, కృష్ణకుమారి దంపతులు, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ దంపతులు వేదికపై ఆసీనులై వ్రతాలు ఆచరించారు. వ్రతాలు అనంతరం భక్తులకు సత్తిసుబ్బారెడ్డి దంపతులు అన్నదానం జరిపారు.

ఐ.పోలవరం: మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయంలో జిల్లా నలుమూలల నుంచి సుమారు 1200మంది మహిళలు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ఏసీ, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ, ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ కటారి రామవెంకటసుబ్బరాజు, దాట్ల రామకృష్ణంరాజు జ్యోతి ప్రజ్వలను చేశారు. అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామలకుమార్, పురోహితులు నాగభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. వేదపండితుడు గంటి సుబ్రహ్మణ్యశాస్త్రి, స్వస్తి వాచకుడు నాగాభట్ల రవిశర్మ వేద ఆశీర్వచనం అందించారు.

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రావణమాసం ఆఖరి శుక్రవారం పురస్కరించుని అమ్మవారికి సామూహిక శ్రీచక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుతగా విజయదుర్గ అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. సోమేశ్వరం శ్రీబాల త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయం రాయవరంలో అమ్మవారి ఆలయాలు శ్రావణ శుక్రవారం పురస్కరించుని భక్తులతో కిటకిటలాడాయి. ఈకార్యక్రమంలో విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెద్దపాటి సత్యకనక దుర్గ, పీఠం పీఆర్వో బాబి భక్తులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం నాలుగో శుక్రవారం సామూహిక వరలక్ష్మి వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఆలయ వసంత మండపంలో ఉన్న లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలకు అశేష భక్తజనం హాజరై వ్రతాలు నిర్వహించారు. ఆలయాలవద్ద శ్రావణశోభ సంతరించుకుంది. ఆలయ ఉపకమిషనర్ కిశోర్‌కుమార్, ఈవో కృష్ణచైతన్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సామూహిక లక్షకుంకుమార్చన

అమలాపురం రూరల్/టౌన్: శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో బండారులంక బిళ్లవారి వీధిలో ఉన్న శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి మందిరం వద్ద శ్రీశ్రీనివాసా బాలమిత్రసంఘం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు బీరక భీమేశ్వరరావు సామూహిక కుంకుమార్చనలు జరిపించారు. సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, బిళ్ల విశ్వేశ్వరరావు, పిల్లి పల్లపురాజు, కొండా సుబ్రహ్మణ్యమూర్తి పాల్గొన్నారు. అమలాపురంలో ఆర్యవైశ్య మహిళలు, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంవద్ద సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా సంఘ అధ్యక్షురాలు పచ్చిగోళ్ల సత్యశ్రీ, పచ్చిపులుసు పద్మ, కోశాధికారి నూలు సత్య, గోకవరపు సుభద్ర ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ఆలమూరు: మండలంలోని చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ఈవో ఉండవల్లి వీర్రాజు అధ్వర్యంలో వ్రతాన్ని ఆచరించిన మహిళలకు పూజా సామగ్రిని అందజేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా కుంకుమార్చనలు చేయించారు.



గాజులతో అలంకరించిన శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు, వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలు

అంతర్వేది: అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోని శ్రీరాజ్యలక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంవద్ద సామూహిక వరలక్ష్మీ వ్రతాలు వైభవంగా జరిగాయి. తొలుత ఆలయానికి వచ్చిన భక్తులకు దాతల సహకారంతో సమకూర్చిన పూజా సామాగ్రిని ఉచితంగా భక్తులకు అందించారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిని గాజులతో అలంకరించారు. అనంతరం స్వామిని దర్శించుకుని అన్నదానంలో ప్రసాదం స్వీకరించారు. పూజా కార్యక్రమంలో ఆలయ ఏసీ వి.సత్యనారాయణ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

3న మండపేటలో జాబ్‌మేళా

ముమ్మిడివరం, ఆగస్టు 30: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెప్టెంబరు 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపారు. సుమారు మూడు కంపెనీలకు సంబంధించి 410 కిపైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లాలో ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తిచేశారు. వివరాలకు 8099183854, 8247645389, 8121838392 సంప్రదించాలన్నారు.

హెవీ డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

అమలాపురం టౌన్, ఆగస్టు 30: అమలాపురం ఆర్టీసీ డిపోలో 9వ బ్యాచ్‌గా పదహారు మంది అభ్యర్థులకు శుక్రవారం నుంచి 32రోజులపాటు హెవీ డ్రైవింగ్ శిక్షణ ఇవ్వనున్నట్టు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.రవికుమార్ ముఖ్యఅతిథిగా హాజరై శిక్షణా కళాశాలలో అందించే సౌకర్యాలను వివరించారు. త్వరలో పదో బ్యాచ్ శిక్షణాతరగతులు ప్రారంభమవుతాయని, అభ్యర్థులు డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ రజాక్ సెల్ 7282909588ను సంప్రదించి పేర్లు నమోదు చేయించుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

అన్నాక్యాంటీన్ నిర్వహణకు రూ. లక్ష విరాళం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 30 : అన్నాక్యాంటిన్ నిర్వహణకు శుక్రవారం రామచంద్రపురం పట్టణానికి చెందిన విశ్వేశ్వరరావు, అనంతలక్ష్మిల జ్యేష్ట కుమార్తె పావని, అల్లుడు కంటిపూడి సాయిరామకృష్ణ దంపతులు రూ. లక్ష విరాళం అందజేశారు. 17వ వివాహవార్షికోత్సవం పురస్కరించుకుని వారి కుమార్తె కీర్తన, కుమారుడు సోహిత్‌ల చేతులమీదుగా లక్షవిరాళం చెక్కును మంత్రి వాసంశెట్టి సుబాష్‌కు అంద జేశారు. కార్యక్ర మంలో పట్టణ టీ.డీ.పి అధ్యక్షుడు కడియాల రాఘవన్ పాల్గొన్నారు.

ఇసుక మాఫియా పూర్తిగా వైసీపీదే: మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 30: రామచంద్రపురంలో ఇసుకమాఫియా అంతా వైసీపీదేనని మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. శుక్రవారం పట్టణ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెల్లసావరంలో ఇసుక దోపిడీ చేసింది టీడీపీ అని వైసీపీ ఇన్‌చార్జి సూర్యప్రకాష్ అనడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో వెల్లసావరంలో ఇసుకను కట్టాపండు, మాజీమంత్రి వేణు తనయుడు నిల్వ చేశారన్నారు. ఇసుక వేసిన స్థలం, ఇసుక తరలించిన స్థలం కూడా వైసీపీకి చెందిన కట్టా అశోక్ అలియాస్ పండుదేనని అన్నారు. ఇసుక చోరీకి ఉపయోగించిన ఎక్స్‌కవేటర్, లారీలు వైసీపీకి చెందిన కట్టా పండువేనన్నారు. కట్టా పండు, కాండ్రేగుల సాయిరామ్‌లు ఇసుక తమదేనని టీడీపీకి చెందిన ఆదిమూలం మణికంఠ, వాసంశెట్టిబాలకు ఎంతోకొంత ఇస్తామని మా ఇసుక మేము తీసుకుపోతామని చెప్పి ఇసుక తరలించుకుపోయారన్నారు. సూర్యప్రకాష్ తెలుసుకుని మాట్లాడితే మంచిదన్నారు. గంజాయి, మాఫియాలో ఉన్నవారినిగాని, ఆకతాయిలను ఉపేక్షించేదిలేదన్నారు.

కౌన్సిల్‌లో చర్చించిన సమస్యలు పరిష్కరించండి

●రామచంద్రపురం కౌన్సిల్ సమావేశంలో సభ్యుల డిమాండ్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 30: కౌన్సిల్ సమావేశంలో లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కౌన్సిలర్ వాద్రేవు సాయిప్రసాద్‌తోపాటు పలువురు కౌన్సిలర్లు కోరారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఎజెండాలో తొలి అంశంపై చర్చిస్తూ షాపింగ్ కాంప్లెక్సు అద్దెలు బకాయిలు వసూలుకు చర్యలు చేపట్టేందుకు కోర్టుఖర్చులకు రూ.1.91వేలు ప్రతిపాదనపై కౌన్సిలర్ సాయిప్రసాద్ అభ్యంతరం వ్యక్తంచేశారు. బకాయిదారులు ఎంతమంది, ఎంతమొత్తం బకాయిలు ఉన్నాయి. వారికి నోటీసులు జారీ చేశారా అంటూ ప్రశ్నించారు. వివరాలు తెలియపరచాలన్నారు. అంశాన్ని వాయిదావేయాలని సాయిప్రసాద్ కోరారు. ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి చోడవరం కబేళావరకు సిల్టు తీసేందుకు రూ.2.5లక్షలు కేటాయించారు ఈమొత్తం సరిపోదని వైస్‌చైర్మన్ శివాజీ అన్నారు. అంచనాలకు ఎజెండా అంశాలకు పొంతనలేదన్నారు. దీంతో కమిషనర్ ఎస్టిమేటు రివైజు చేస్తామని హామీ ఇవ్వడంతో ఆమోదించారు. సమావేశంలో చర్చించిన అంశాలువచ్చే సమావేశంలోపు పరిష్కరించాలని కోరారు. ఎజెండా 9 అంశాలకుగాను 8 అంశాలు ఆమోదించారు. రూ.40లక్షలతో మేజరు డ్రైన్లలో సిల్టుతీసేందుకు ఆమోదం తెలిపారు. రూ.1.40 లక్షలతో పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.సమావేశంలో చైర్‌పర్సన్‌లు కొలమూరి శివాజీ, చింతపల్లి నాగేశ్వరావు, కమీషనరు బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పవన్ పుట్టినరోజున సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

● ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రాజోలు ఎమ్మెల్యే వరప్రసాద్

రాజోలు/అంతర్వేది,ఆగస్టు 30: సెప్టెంబరు 2వ తేదీన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజున సేవా కార్యక్రమాలు నిర్వహించాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం శివకోటిలో తెలగ కల్యాణ మండపంలో రాజోలు మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ రాజోలు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు రక్తదాన శిబిరాలు, ప్రతీ గ్రామంలో పారిశుద్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాజోలు మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, గుండుబోగుల పెదకాపు, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, దొడ్డా జయరామ్, కడలి ఏడుకొండలు, పినిశెట్టి బుజ్జి, రేకపల్లి మామాజీ, రావి మురళీ, వైస్ ఎంపీపీ ఇంటిపల్లి ఆనందరావు, గుండాబత్తుల తాతాజీ పాల్గొన్నారు.

'పనిచేస్తూ ముందుకు వెళదాం'

మలికిపురం: జనసేన రాష్ట్ర అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా గ్రామాల్లో ఒక తరహా ఉద్యమానికి నాంది పలుకుదామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శుక్రవారం గుడిమెళ్లంక సామాజిక భవనంలో జరిగిన మలికిపురం మండల ఎన్డీఏ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ గొప్పదనాన్ని గౌరవిద్దాం. ఆయన ఆశయాలకు తగ్గట్టుగా కాలుష్య నివారణకు అధిక ప్రాధాన్యతనిద్దామన్నారు. సమావేశంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, గుండుబోగుల పెదకాపు, అడబాల యుగంధర్, మల్లిపూడి సత్తిబాబు, తాడి మోహన్, గెద్దం మహలక్ష్మిప్రసాద్, పినిశెట్టి బుజ్జి, చెల్లింగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు డిజిటల్ విద్యపై శిక్షణ

ముమ్మిడివరం, ఆగస్టు 30: దివ్యాంగ విద్యార్థినీ విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించి వారిలో అభ్యాసన నైపుణ్యాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రాష్ట్ర సమగ్ర శిక్ష ఐఈ కన్సల్టెంట్ డాక్టర్ వై.నరసింహం పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల సమావేశ మందిరంలో ట్యాబ్‌ల వినియోగంపై సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు అధ్యక్షతన శుక్రవారం జిల్లాలోని శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల అభ్యాసనలో మంచి ఫలితాలు రాబట్టేందుకు సమగ్ర శిక్ష ద్వారా ట్యాబ్‌లను పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్ర సహిత విద్య సహాయ సమన్వయకర్త డాక్టర్ ఎస్.అమ్మినాయుడు మాట్లాడుతూ ట్యాబ్‌ల్లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో పాటు 33 రకాల యాప్‌లు అప్‌లోడ్ చేయడంవల్ల దివ్యాంగులకు ఉపయోకరమన్నారు. సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధికి సమగ్ర శిక్ష అన్నికాల అవసరాలు కల్పిస్తుందన్నారు. రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్ బొద్దు మహలక్ష్మినాయుడు, పి.సునీల్‌కుమార్ యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు.

చిన్నారులకు బాలభవన్ బాసట

యానాం, ఆగస్టు 30: యానాం విద్యాశాఖపరిధిలోని జవహార్ బాలభవన్‌లో విద్యనభ్యసిస్తున్న చిన్నారులకు బాలభవన్ సూపర్‌వైజర్ చింతా కొండలరావు, సిబ్బంది నగదుతో కిసాన్ పత్రాలను అందజేశారు. చిన్నారులు పెన్నాడాఅలేఖ్య, పెన్నాడ దేవి, పెన్నాడాకార్తీక్ లకు ఈపత్రాలను అంద జేశారు. చిన్నారుల తండ్రి పెన్నాడ బుజ్జియ్య (35) ఇటీవల రోడ్డు ప్రమాదంతో మృతి చెందారు. భార్య ముగ్గురు పిల్లలకు బాలభవన్ ఉద్యోగులు రూ.75వేలు సమకూర్చారు.

ఆత్మహత్యకు పాల్పడిన న్యాయవాది మృతి

మామిడికుదురు, ఆగస్టు 30: అప్పుల బాధతో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన జూనియర్ న్యాయవాది అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ తెలిపిన వివరాల ప్రకారం అప్పనపల్లి గ్రామానికి చెందిన మేడేపల్లి సురేష్ (30) గురువారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆతనే స్వయంగా 108కు ఫోన్‌చేసి తాను గడ్డి మందు తిన్నానని చెప్పాడని ఎస్ఐ తెలిపారు. అతన్ని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్ఐ చెప్పారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

అమలాపురం టౌన్, ఆగస్టు 30: డ్రైవర్, కండక్టర్ల నైటౌట్ అలవెన్సులను తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అమలాపురం ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలిపారు. తొలుత గేట్ మీటింగ్ నిర్వహించి ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై చర్చించారు. జీవో నంబరు 114లోని అలవెన్సులను అమలు చేయాలని, పీటీడీ రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యూటీ, ఆర్జిత సెలవుల బకాయిలు వెంటనే చెల్లించాలని, సర్వీసులో ఉన్న ఉద్యోగుల వేతన బకాయిలు చెల్లించాలని, చనిపోయిన ఉద్యోగుల అంత్యక్రియల ఖర్చు నిమిత్తం రూ.25 వేలు ట్రెజరీ ద్వారా చెల్లించాలన్నారు. ఎన్ఎంయూ నిరసనకు యునైటెడ్ వర్కర్స్ యూనియన్ సంఘీభావం తెలిపింది. నిరసనలో ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పందిరి రాంబాబు, డిపో కార్యదర్శి పితాని మణిరాజు, అధ్యక్షుడు ఎండీ ఔలియా, వి.గణపతి, డిపో కార్యదర్శి కె.రంగప్రసాద్ పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న సిబ్బంది ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఏఎస్ రావు, సెక్రటరీ బి.ఏసేబు, వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ గంగాధరం, యునైటెడ్ వర్కర్స్ యూనిటి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): పలు డిమాండ్ల సాధనకు శుక్రవారం మధ్యాహ్నం ఎన్ఎంయుఏ ఆధ్వర్యంలో ఆర్టీసీ ఉద్యోగులు రామచంద్రపురం డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షుడు బి.ముత్యాలరావు, జాయింగ్ సెక్రటరీ ఎం.వి.ఎస్.ఎన్ మూర్తి, వర్కింగ్ ప్రెసిడెంటు పి.ఎస్.నారాయణ, యునైటెడ్ వర్కర్సు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి ఆలయ విగ్రహ ప్రతిష్ఠ

రావులపాలెం, ఆగస్టు 30: గోపాలపురంలోని కొత్తకాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీ విజయగణపతి ఆలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మైగాపుల గురవయ్యనాయుడు, అధికారి నాగు, తోట స్వామి, యాళ్ల మునేశ్వరరావు పాల్గొన్నారు.

గోడి గురుకుల పాఠశాలలో వనమహోత్సవ జాతర

అల్లవరం, ఆగస్టు 30: అల్లవరం మండలం గోడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర, బాలికల గురుకుల పాఠశాలలో వన మహోత్సవం జాతర కార్యక్రమం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలల్లో మొక్కలు నాటారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి: ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, ఆగస్టు 30: పర్యావరణ పరిక్షణకు మొక్కలను నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం రాయవరం రాజేశ్వరకాలనీ ప్రాథమిక పాఠశాలలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. పాఠశాల గేటు నుంచి ప్రాంగణంలో విద్యార్థులు నడిచి వెళ్లేందుకు వీలుగా మార్గం నిర్మాణానికి భూమి పూజ, రాయవరంలో ఏర్పాటు చేసిన మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ రామకృష్ణ, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, వార్డు సభ్యుడు టి.రామచంద్రారెడ్డి, కూటమి నేతలు ఉండవిల్లి రాంబాబు, దేవిశెట్టి కరుణ, వెలుగుబంట్ల గోపీకృష్ణ, చల్లా సత్యనారాయణ, పీఎంసీ చైర్మెన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, నల్లమిల్లి రాజేష్‌రెడ్డి, మల్లిపాల గోవిందు, హెచ్ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

మండపేట: కాలుష్యనివారణ కోసం ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే వేగుళ్లజోగేశ్వరరావు ప్రజలకు పిలుపు నిచ్చారు. కాలుష్య నివారణకోసం ప్రజారోగ్యంను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వనం మనం పేరిట మొక్కలు నాటే కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. పట్టణంలో శుక్రవారం ఏడిద రోడ్డులోవున్న వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గ్రీన్‌క్లబ్ సభ్యులు నేతృత్వంలో వనం మనం కార్యక్రమంలో వేగుళ్ల సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ బి.రాము, డీఈఈ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు, యరమాటి గంగరాజు, కాశిన కాశీ విశ్వనాథం, కొవ్వాడబేబీ, చిట్టూరి సతీష్, మాజీకౌన్సిలర్ వల్లూరి ఇందిరారాణి, వల్లూరి దొరకయ్య గుండు సత్తిరాజు, చింతలపూడి సత్తిబాబు శెట్టిరవి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ప్రకృతి సంరక్షణను ప్రతీఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించి మొక్కలు నాటాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. వనం-మనంలో భాగంగా ముమ్మిడివరం నగర పంచాయతీ 4వ వార్డులోగల జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో నగర పంచాయతీ ఇన్‌చార్జి కమిషనర్ కె.సత్యనారాయణ, నాయకులు ములపర్తి బాలకృష్ణ, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, విళ్ల వీరాస్వామినాయుడు, దాట్ల బాబు, కట్టా సత్తిబాబు, మెండి కమల, కడలి నాగు, బొక్కా రుక్మిణి, జె.సత్యనారాయణ రాజు, హెచ్ఎం సీహెచ్ పరిమళ, కూటమి నాయకులు, నగర పంచాయతీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురు: పర్యావరణ పరిరక్షణకు విధిగా మొక్కలు నాటాలని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు సూచించారు. వనం-మనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మగటపల్లి హైస్కూలులో ఆయన మొక్కలు నాటారు. అదేవిధంగా లూటుకుర్రులో సర్పంచ్ అడబాల తాతకాపు మొక్కలు నాటి ప్రతీ మొక్కల పెంపకానికి ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో స్థానికులు, నాయులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ ధర్నా

అమలాపురం టౌన్, ఆగస్టు 30: యూనిఫైడ్ పెన్షన్ స్కీమును రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో అమలాపురం ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు పెన్షన్ ప్రభుత్వాలు ఇచ్చే భిక్ష కాదని ఉద్యోగుల హక్కు అని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమును రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసుకోవచ్చని సూచన చేయడాన్ని యూటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటీవీ సుబ్బారావులు ఖండించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ పథకం పలు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన అనంతరం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డికి వినతిపత్రం అందజేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. నిరసనలో జిల్లా కార్యదర్శులు జీవీ రమణ, కె.శ్రీనివాస్,బీఎస్.వెంకటేశ్వరరావు, కె.పరమేష్, ఎస్వీ రమణ, చిక్కం హరిబాబు, కె.సురేష్‌కుమార్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి

కొత్తపేట, ఆగస్టు 30: ఎస్టీయూ కోనసీమ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1న సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలనే డిమాండ్‌తో గన్నవరంలో నిర్వహించే నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని ఎస్టీయూ సీపీఎస్ కన్వీనర్ బండారు నారాయణ కోరారు. కొత్తపేటలో ఓ ప్రకటనను విడుదల చేశారు. రాష్ట్రశాఖ నుంచి ఈ నిరసన ర్యాలీలో ఎల్.సాయిశ్రీనివాస్ పాల్గొంటారని అధిక సంఖ్యలో ఎస్టీయూ కార్యకర్తలు, సీపీఎస్ ఉద్యోగులు పాల్గొనాలని కోరారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోతంశెట్టి దొరబాబు, ఎస్ఎస్ పల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్ పర్యవేక్షణలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలి

ముమ్మిడివరం, ఆగస్టు 30: జిల్లాలోని విద్యా సంస్థల్లో జిల్లా పేరును కోనసీమ జిల్లాగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతున్న విద్యా సంస్థలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాగా ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం జిల్లాశాఖ డీఈవో ఎం.కమలకుమారికి వినతిపత్రాన్ని సమర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం ప్రతినిధులు శుక్రవారం ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో గల విద్యాశాఖాధికారిణి ఎం.కమలకుమారిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బత్తుల నకులరాజు, గోసంగి బంగార్రాజు, జనిపల్లి బాలకృష్ణ, సాధనాల సత్యనారాయణ, గెడ్డం ప్రదీప్, మట్టా శ్రీనివాసరావు, బీఎస్ఆర్ ప్రసాద్, కె.కల్యాణ్‌బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉండమట్లలో విగ్రహం ధ్వంసం

ఆలమూరు, ఆగస్టు 30: ఆలమూరు మండలం నర్సిపూడిలో గ్రామ ప్రముఖుడు ఉండమట్ల జానకీరామయ్య విగ్రహాన్ని గురువారంరాత్రి ధ్వంసం చేశారు. నర్సిపూడి మెయిన్‌రోడ్డులోని రామాలయం వద్ద ఉన్న జానకిరామయ్య విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు గోనెసంచులు, టైర్లు చుట్టి ఆయిల్ పోసి నిప్పు పెట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. గ్రామస్తుల ఫిర్యాదుతో ఆలమూరు ఎస్ఐ అశోక్ ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించి సంఘటనా స్థలంలో ఉన్న వస్తువులను సేకరించారు. విచారణచేసి నిందితులను పట్టుకుంటామన్నారు.

వయనాడ్ వరద బాధితులకు విరాళం

అమలాపురం టౌన్, ఆగస్టు 30: కేరళలోని వయనాడ్‌లో సంభవించిన భారీ వరదలకు నష్టపోయిన బాధితుల కోసం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ రూ.4.50 లక్షల విరాళాన్ని చెక్కుగా అందజేసింది. యూనియన్ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం అమలాపురంలో బండి వెంకటలక్ష్మి అధ్యక్షతన సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ముఖ్య అతిథులుగా హాజరుకాగా జిల్లా కమిటీ తరపున చెక్కును అందించారు. రాష్ట్ర ప్రతినిధులు మాట్లాడుతూ సమ్మె సందర్భంగా అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలకు వెంటనే జీవోలు విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీలపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలు చెల్లించాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్, యూనియన్ కోశాధికారి పి.అమూల్య, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలు.. విలువలు పెంపొందించుకోవాలి

అమలాపురం టౌన్, ఆగస్టు 30: జీవన నైపుణ్యాలతోపాటు మానవతా విలువలు పెంపొందించుకోవాలని ఇండియన్ సోషల్ ఇన్‌స్టిట్యూట్ (బెంగళూరు), ఉభయ తెలుగురాష్ట్రాల ఫెసిలిటేటర్ జి.కరుణాకర్ చెప్పారు. అమలాపురంలోని కార్మిలైట్ సిస్టర్స్ ఆఫ్ సెయింట్ థెరిస్సాలో చేపట్టిన మూడు రోజుల శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు కరుణాకర్ తెలిపారు. శిక్షణలో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు.